క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన మాచిరెడ్డి వారి వివాహ వేడుకలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం వధూవరులు విష్ణువర్ధన్, చందనలను ఆయన ఆశీర్వదించారు.

జంతువుల పట్ల కరుణ చూపాలి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరూ జంతువుల పట్ల కరుణ కలిగి ఉండాలని గూడెంచెరువు పశు సంవర్ధక వైద్యులు జాన్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధి గూడెంచెరువులో ఉన్న కస్తూర్బా గాంధీ ఉన్నతపాఠశాలలో పిల్లలకు జంతు సంరక్షణ పక్షోత్సవాలలో భాగంగా వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాన్ సుధాకర్ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కొండాపురం : మండల పరిధిలోని కొండాపురం పెంజి-అనంతపురం గ్రామాల మధ్యలో కణం వద్ద పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు కొండాపురం ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4900 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

నకిలీ ఎరువులు, పురుగుల మందులు అమ్మితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : నకిలీ ఎరువులు, పురుగు మందులను దుకాణాదారులు రైతులకు అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. అలాగే రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనంతరం ఎరువుల దుకాణంలో ఉన్న స్టాక్ రిజిష్టరును పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, ఏఈలు కిషోర్, జనార్దన రావు, ఏఓ ప్రెసిలీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చెన్నూరు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడు ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. చెన్నూరు టౌన్‌లోని 1వ సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు ఎంపీపీ, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డిలు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ వలంటీర్లు ఇటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సేవలు అందించాలన్నారు. అలాగే సచివాలయానికి నేరుగా వచ్చిన ప్రజలతో సావధానంగా మాట్లాడి వారి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

రేపటి నుంచి నల్లనమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లె గ్రామంలోని నల్లనమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం గ్రామోత్సవం ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు న్యూ కేటగిరి ఒంగోలు జాతి ఎద్దులచే రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయన్నారు. భక్తులకు రెండు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ సుబ్బారావు

జమ్మలమడుగు రూరల్ : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చునని పట్టణ ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వి.రావు ఆధ్వర్యంలో ఆయన ఆర్టీసీ గ్యారేజీలో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన సూచనలను సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరాశ పరిచిన ధనియాల సాగు

- రబీ సాగులో తగ్గిన దిగుబడులు
- నియోజకవర్గంలో 15 వేల ఎకరాలలో సాగు
- పెట్టుబడులు రాలేదని రైతుల ఆవేదన



వేముల వద్ద సాగులో ఉన్న ధనియాల పంట



కుప్పగుట్టపల్లెలో ధనియాల పంటను దున్నివేసిన రైతులు

వేముల : ఈ ఏడాది ధనియాల సాగు రైతులను నిరాశ పరిచింది. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు వస్తాయనే ఆశతో రబీలో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు ధనియాల సాగు చేసుకున్నారు. అంతేకాక సాగు చేసిన 80 రోజులకే దిగుబడులు చేతికొస్తాయని రైతులు ధనియాల సాగుపైనే దృష్టి పెట్టారు. సాగు చేశాక పంట ఆశాజనకంగా కనిపించింది. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ వాతావరణంలో మార్పులతో పంట పూర్తిగా దెబ్బతింది. పంట పూత దశలో ఉండగా.. తుఫాన్ ప్రభావంతో మబ్బులు, వర్షాలు పడటంతో పంటలో 50 శాతం దిగుబడులు తగ్గిపోయాయని రైతులు అంటున్నారు.

నియోజకవర్గంలో 15వేల ఎకరాలలో సాగు : ఈ ఏడాది పులివెందుల నియోజకవర్గంలో 15వేల ఎకరాలలో ధనియాల పంటను రైతు సాగు చేసుకున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 50 శాతం మేర సాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. ప్రతి ఏడాది రబీలో శనగ పంటను రైతులు ఎక్కువగా సాగు చేసేవారు. అయితే శనగ సాగులో పెట్టుబడులు పెరగడంతో రైతులు ధనియాల పంటను ఎంచుకున్నారు. వేముల మండలంలో 50 శాతానికి పైనే ధనియాల సాగు విస్తీర్ణం పెరిగింది. పంట కాలం తక్కువ కావడంతో రైతులు ధనియాలపైనే ఆసక్తి చూపారు.

సాగులో తగ్గిన దిగుబడులు : రబీలో సాగు చేసిన ధనియాల పంట దిగుబడులు తగ్గిపోయాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి సకాలంలో పంట సాగు చేసినా దిగుబడులు మాత్రం ఆశించిన మేర అందలేదు. గత ఏడాది ఎకరాకు 8 బస్తాల నుంచి 10 బస్తాల మేర దిగుబడులు వస్తే ఈ ఏడాది 4 నుంచి 5 బస్తాలు మాత్రమే దిగుబడులు అందుతున్నాయి. పంటలో దిగుబడులపై వాతావరణం దెబ్బతీసింది. పొగ మంచు కారణంగా పూత మగ్గిపోయింది. అంతేకాక తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షం ధనియాల సాగుపై ప్రభావాన్ని చూపింది. సాగులో ఆశించిన దిగుబడులు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్‌లో తగ్గిన ధరలు : ధనియాల ధరలు మార్కెట్‌లో గణనీయంగా పడిపోయాయి. సాగులో పెట్టుబడులు కావడం.. దిగుబడులు, ధరలు తగ్గిపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. గత ఏడాది 43 కిలోల ధనియాల బస్తా రూ.4,200 ధర ఉంటే.. ఈ ఏడాది అదే బస్తా రూ.3 వేలలోపు ధరలు ఉండటంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు తగ్గినా ధరలు ఉంటే రైతులు పెట్టుబడులు గిట్టుబాటు అయ్యేవి. ధరలు, దిగుబడులు తగ్గడంతోనే రైతులకు నష్టాలు తప్పడంలేదు.

గిట్టుబాటు కాక పంటను దున్నేస్తున్న రైతులు : ఈ ఏడాది రబీలో సాగు చేసిన ధనియాల పంట రైతుకు గిట్టుబాటు కాలేదు. మండలంలోని కుప్పగుట్టపల్లె గ్రామంలో కొంతమంది రైతులు ధనియాల పంట కోసి ఉత్పత్తులను వేరు చేసేందుకు అయిన ఖర్చులు కూడా రావడంలేదని పంటను దున్ని వేస్తున్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలో శుక్రవారం విజయనగర సామ్రాజ్యాధినేత, ఆలయాల రూపకర్త శ్రీకృష్ణదేవరాయలు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో ఆ సంఘ అధ్యక్షుడు గూడూరు గురు ప్రసాద్ ఆధ్వర్యంలో బలిజ సంఘం సభ్యులందరూ కలిసి శ్రీకృష్ణదేవరాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి డప్పు వాయిద్యాల మధ్య బాజా సందా పేల్చుతూ పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల గురించి మాట్లాడాలంటే ఎంతో ఉందన్నారు. ఎన్నో దేవాలయాల నిర్మాణాలు చేసి ఘన కీర్తి పొందారన్నారు. రాయలసీమకు రతనాల సీమగా ఆయన వల్లే పేరు వచ్చిందన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు అంజనేయులు, బొట్టు బాలయ్య, యార్వ వెంకటసుబ్బయ్య, సర్వేశ్వరుడు, బాబు, మాజీ అధ్యక్షుడు సోపాల వీరా, పెద్ద వీరయ్య, సుబ్బరాయుడు, హరి, నక్క విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రజ్జబ్ నెల అందరికీ శుభాలను కలిగిస్తుంది



భక్తులకు ఉపన్యాసం ఇస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : రజ్జబ్ నెలలో ప్రతి ముస్లిం తన సంపాదనలో దానం చేయడం వల్ల శుభాలు కలుగడంతోపాటు, వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ ఖాజీ ఆస్థానయేగౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌసేపీరాఖాద్రీ పేర్కొన్నారు. రజ్జబ్ నెల మొదటి వారం కావడంతో ఆస్థానయేగౌసియాలో భక్తులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రజ్జబ్ నెలలో ఐదు రొట్టెలను తయారు చేసి ఆకలితో ఉన్నవారికి ఇవ్వడం వల్ల అల్లా సంతోషిస్తారన్నారు. మహమ్మద్ ప్రవక్త వంశస్తురాలైన బీబీ ఫాతిమా తన కుటుంబ సభ్యులతో భోజనం చేయడం కోసం సిద్ధమౌతున్న సమయంలో అల్లా దేవదూతను పక్కీరు రూపంలో వారి ఇంటికి పంపించారు. పక్కీరు ఆకలితో ఉన్నాను అన్నం పెట్టాలంటూ కోరడంతో తాను తయారు చేసిన ఐదు రొట్టెలను పక్కీరుకు పెట్టారు. ఎంతో ఆకలిగా ఉన్న వారు తమ కోసం తయారు చేసుకున్న రొట్టెలను దానం చేయడం ద్వారా అల్లా వారికి ఉన్న దాన గుణాన్ని మెచ్చుకున్నాడన్నారు. ఈనెలలో అల్లా యొక్క కృప ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈనెలలో మూడు రోజులు(ఉపవాసం) ఉండటం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈనెల 29వ తేదీ ఆదివారం అజ్మీర్ షరీఫ్ 811వ ఉరుసు సందర్భంగా పట్టణంలో జెండా ఊరేగింపు నిర్వహించి సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ, సయ్యద్‌షా తాహీర్ పీరాఖాద్రీ భక్తులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు సిద్ధమైన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

చెన్నూరు : రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని శనివారం చెన్నూరులోని లక్ష్మి వెంకటేశ్వరస్వామి (కొట్ల స్వామి), చెన్నూరు సరస్వతీ కాలనీలోని శ్రీ లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. చెన్నూరు సరస్వతి కాలనీలోని లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం, వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

శనగపంట కోత ప్రయోగం



పొలంలో కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

కొండాపురం : రబీ సీజన్‌లో సాగు చేసిన బుడ్డశనగ పంటను పొలంలో కోత ప్రయోగం చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కోనవారిపల్లె, బురుజుపల్లె గ్రామాలల్లో శనగ పంట దిగుబడిపై పంట కోత ప్రయోగాలు వ్యవసాయ అధికారులు, బీమా అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి ఏడీ మాట్లాడుతూ తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే బీమా, శనగపంట మద్దతు ధరలకు అమ్ముకోవడానికి అర్హులు అవుతారన్నారు. గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్ నమోదుపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బురుజుపల్లె గ్రామంలో పంటకోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. అంకిరెడ్డి వెంకటరామిరెడ్డి సర్వేనెంబర్ 102/1 పొలంలో 5X5 మీటర్లలో పంటకోత ప్రయోగం నిర్వహించగా దిగుబడి 1.700 గ్రాములు, భూమిరెడ్డి నాగశంకర్‌రెడ్డి శనగపంట పొలంలో(సర్వేనెంబర్ 10/4) లో 5X5 మీటర్లలో పంటకోత ప్రయోగం చేయగా దిగుబడి 2.270 వచ్చిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న శనగపంట మద్దతు ధర తో అమ్ముకోవాలంటే తప్పని సరిగా రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకుంటేనే వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబులేసు, ఎఈఓ రమేష్, వీహెచ్ఏ సురేష్, బీమా సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు

పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ముద్దనూరులో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేస్తున్న ఎస్ఎస్ఏ పీఓ

ముద్దనూరు : పదవ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం మంది విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేసేలా ఆదేశాలిచ్చామని ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి మాట్లాడారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని, నాడు-నేడు పాఠశాలల్లో నాబార్డు నిధులతో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని, జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని పీఓ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం నాడు-నేడు పనులను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి ప్రాజెక్టు అధికారి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన భానుకోటేశ్వరస్వామి క్షేత్రం

ఫిబ్రవరి 1 నుంచి మూడు రోజులపాటు కార్యక్రమాలు



నూతన హంగులతో ముస్తాబైన ఆలయం

సింహాద్రిపురం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోటేశ్వరస్వామి క్షేత్రం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.4 కోట్లకుపైగా తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయం అత్యంత సుందరంగా నిర్మితమై అందరిని ఆకర్షిస్తోంది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భానుకోట క్షేత్రాన్ని నూతన హంగులతో నిర్మించడం జరిగిందని గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ శంకర బాలాజీ, ఆలయ కార్య నిర్వాహణాధికారి విశ్వనాథరెడ్డిలు తెలిపారు.

నూతన ఆలయాలు, విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు

రావులకొలను పంచాయతీ పరిధిలోని భానుకోటేశ్వరస్వామి క్షేత్రంలో వేడుకలను ఫిబ్రవరి 1వ తేదీనుంచి మూడవ తేదీవరకు నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. చివరిరోజు రాత్రి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దాతల సహకారం



దాతలకు అంజనేయస్వామి చిత్ర పటాన్ని అందిస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్, అర్చకులు

వేంపల్లె : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.2,25,580లు సహకారం అందించారు. శుక్రవారం దాతలు ఆ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్‌లకు అందజేశారు. వేంపల్లె పట్టణానికి చెందిన ఎం.సుబ్బారెడ్డి, శారద దంపతులు రూ.1,00,116లు, హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి, వేదవతి దంపతులు రూ.50,116లు, రామకృష్ణారెడ్డి, సుజాత దంపతులు రూ.25,116లు, కడపకు చెందిన చంద్రమౌళి, తులశమ్మ దంపతులు రూ.25,116లు, వేంపల్లె పట్టణం చింతలమడుగుపల్లెకు చెందిన ఎస్.అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.25,116ల నగదును అందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి మాట్లాడుతూ శాశ్వత నిత్యాన్నదాన పథకం ద్వారా ప్రతి రోజు 200 మంది భక్తులకు అన్నదానం చేయడం జరుగుతోందని.. దాతలు మరింత మంది ముందుకొస్తే మరింత మందికి భోజన వసతి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దాతలకు ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అండర్-17 షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



షూటింగ్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్

వేంపల్లె : వేంపల్లెలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్-17 షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం డీఎస్‌డీఓ ఆదేశాల మేరకు జిల్లా షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య నేతృత్వంలో పోటీలు నిర్వహించి జిల్లా తరపున ఆడేందుకు జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికైన వారు ఈనెల 29వ తేదీన చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ కాప్ లీగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, పీడీ తేజేంద్ర, క్రీడాకారులు తెలిపారు.

ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ల ఐక్యత అభినందనీయం



రక్తదానం చేస్తున్న ఎలక్ట్రీషియన్లను అభినందిస్తున్న ఎస్ఐ చిరంజీవి, తదితరులు

పులివెందుల టౌన్/రూరల్ : ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల ఐక్యత అభినందనీయమని ఎస్ఐ చిరంజీవి అన్నారు. శుక్రవారం ఎలక్ట్రీషియన్ నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ ఉర్దూ షాదీఖానాలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ చిరంజీవి హాజరై మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానంతో సమానమన్నారు. ఎస్ఐ రక్తనిధి మెడికలాఫీసర్ దివ్యశ్రీ ఎలక్ట్రీషియన్ల జెండాను ఆవిష్కరించి లక్కీడిప్ కూపన్ల ద్వారా బహుమతులను అందించారు. ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్, అసోసియేషన్ సంఘ ప్రతి నిధులు, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

వేంపల్లె : ఎలక్ట్రీషన్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వేంపల్లె మెయిన్ బజార్‌లో ఉన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ దినోత్సవ వేడుకలకు వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్‌ను గుర్తు చేసుకుంటూ ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలి

వేంపల్లె : ఓటరు కార్డుదారులందరూ తమ ఆధార్ కార్డును అనుసంధానం చేయాలని వేంపల్లె తహసీల్దార్ ఎస్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరు అనుసంధాన ప్రక్రియ కొరకు మీ యొక్క ఓటరు కార్డుతోపాటు ఆధార్ కార్డును తీసుకుని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఎల్‌ఓకు అందించాలన్నారు. ప్రతి ఓటరు కార్డుదారుడు త్వరలో ఆధార్‌ను అనుసంధానం చేయకపోతే ఓటు హక్కు నుంచి తొలగించబడుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ కూడా తమ ఓటు కోసం ఆధార్‌ను అనుసంధానం చేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక దర్గా-ఇ-గఫ్ఫారియా ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్గా-ఇ-గఫ్ఫారియా, నవీన్ న్యూరో కేర్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రముఖ న్యూరాలజిస్ట్ ఎస్వీ నవీన్ ప్రసాద్ రోగులను పరీక్షించి వైద్య సేవలు అందిస్తారని వారు తెలిపారు. పక్షవాతము, నరముల బలహీనత, తిమ్మిర్లు, మంటలు, మెడ, నడుము నొప్పి, ఫిట్స్, తల తిరగడం, నిద్ర సమస్యలు, నరాలు లాగడం, మైగ్రేన్ తదితర రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రూ.3 వేలు విలువ జేసే ఎముకల సాంద్రత పరీక్ష, రూ.2 వేలు విలువజేసే నరాల పటుత్వ పరీక్ష, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని, మండల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘనంగా సుబ్రమణ్య షష్టి వేడుకలు



సుబ్రమణ్యస్వామిని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణేశ్వర స్వామి దేవస్థానంలో సుబ్రమణ్య షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మాఘ శుద్ధ షష్టి సందర్భంగా ఆలయ అర్చకులు శేషగిరిరావు నేతృత్వంలో స్వామివార్లకు పాలాభిషేకం, కుంకుమార్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా సుబ్రమణ్యస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సాంబశివుడు, శివయ్య, వెంకటేష్, ప్రసాదరావు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపకాంతులతో ఆలయ రాజగోపురం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాత బస్టాండు నందు వెలసిన శ్రీపద్మావతి సమేత కల్యాణ శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి నుంచి అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. రథసప్తమిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు విశేష పూజలు జరిపించనున్నారు. శ్రీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ రాజగోపురం విద్యుత్ కాంతులతో మిరమిట్లు గొలుపుతూ చూపరులను ఆకర్షిస్తుంది. భక్తులకు ఎక్కడ ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల నిరసన

వేంపల్లె : వేంపల్లెలో రేషన్ గోడౌన్ వద్ద సివిల్ సప్లయ్ హమాలీలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్వింటాకు రూ.22లు మాత్రమే ఇస్తోందని.. దీంతో తమ పోషణ భారంగా మారుతోందని గోడౌన్ వద్ద హమాలీలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పలుమార్లు విన్నవించినప్పటికి ఫలితం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం క్వింటాకు రూ.25లకు పెంచుతామనప్పటికి అందుకు సంబంధించి జీవో జారీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే జీఓను జారి చేసి క్వింటాకు రూ.25లు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో హమాలీలు తదితరులు పాల్గొన్నారు.